ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, వీరా


గుత్తి: వేడుకలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ


పెద్దపప్పూరు: శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు


గుంతకల్లు: విశేషాలంకరణలో కావేటి వేణుగోపాల్ స్వామి మూలవిరాట్

గుత్తి: పట్టణంలోని 15వ వార్డు(కండోజీ బావి)లో బుధవారం త్రైత సిద్ధాంత కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరిగే వేడుకలను మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్ అంజల, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వీరా ప్రారంభించారు. శ్రీకృష్ణుని విగ్రహం వద్ద చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుంతకల్లు: ఎస్.తిమ్మాపురంలోని కావేటి వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో వేకువజామున వేణుగోపాల్ స్వామి మూలవిరాట్‌కు పంచామృతభిషేకం చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో స్వామిని అందగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దవడుగూరు : ఏ.తిమ్మాపురం గ్రామంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను యాదవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ట్రాక్టర్ పై పెట్టుకొని ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: రేగడి కొత్తూరు గ్రామంలో త్రైత సిద్దాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి మార్గాన్నే ఎంచు కోవాలన్నారు. కార్యక్రమంలో పుష్పావతి, ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు సూర్య నారాయణరెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి, నల్లప్ప, వేద ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురం, పెద్దపప్పూరు, శింగనగుట్టపల్లిలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నరసాపురంలో బాలకృష్ణుడి ఉత్సవమూర్తిని భక్తులు గ్రామపురవీదుల్లో ఊరేగించారు. భజబృందం సభ్యులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

శింగనమల: శింగనమల రామాలయం వద్ద గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఉదయం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, సాయంత్రం 4 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

పామిడి: స్థానిక కొత్త ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఇందూ–ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు శ్రీకృష్ణుని ప్రతిమను దర్శించుకున్నారు.

తాడిపత్రి అర్బన్: గొల్లపాలెంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. వేడుకలకు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని యాదవులందరూ తరలిరావాలని కోరారు.

గార్లదిన్నె: సంజీవపురం, కల్లూరులో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనం గా నిర్వహించారు. సంజీవపురంలో శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. కల్లూరులో మాజీ ఎంపీటీసీ జగ్గాల రవి ఆధ్వర్యంలో వెండి రథంపై శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. తమిళనాడు డప్పు వాయిద్యాలు, మర మనుషులు సందడి చేశారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించారు.

నెట్టికంటుడికి మహాభిషేకం

గుంతకల్లు రూరల్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి మహాభిషేకం నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శారదమ్మ దంపతులు, కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే దంపతులు అందజేసిన అభిషేకం ద్రవ్యాలతో అర్చకులు స్వామికి మహాభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు సుభిక్షంగా పండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, యువజన మండల కన్వీనర్ బెస్త మనోహర్, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, రామాంజనేయులు, సుధాకర్, పాలక మండలి సభ్యులు త్యాగరాజు, జగదీష్ సేట్, రామకృష్ణమ్మ, పాటిల్ రాధిక, గోపా వెంకటేశ్వర్లు, సరోజ తదితరులు పాల్గొన్నారు.


స్వామికి అర్చన చేయిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, కుటుంబ సభ్యులు

కుంటలో శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహం ప్రత్యక్షం

యాడికి: స్థానిక గంగమ్మ గుడిలో మాయమైన శ్రీకృష్ణుని పంచలోహ విగ్రహం బుధవారం మండల కేంద్రంలోని కుంట వద్ద ప్రత్యక్షమైంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు..గంగమ్మ గుడిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయంలో భద్రపర్చిన శ్రీకృష్ణుడి విగ్రహాని రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులు రహస్యంగా ఉంచారు. దీనిపై శ్రీకృష్ణుడి విగ్రహం మాయం శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. అయితే బుధవారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని కుంటలో గల 1వ రోడ్డులో విగ్రహం దొరికింది. ఎస్ఐ విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.


శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

ఎస్సీ వర్గీకరణకు సహకరించండి

తాడిపత్రి అర్బన్: ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పెద్దిరాజు, ఆదినారాయణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని మేనిఫెస్టోలో పెట్టి తొమ్మిదేళ్లు దాటినా ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ దళితులు, అనుబంధ కులాలు చేస్తున్న శాంతియుత పోరాటానికి సహకరించాలని కోరారు. నాయకులు రవి, కంబగిరి, వెంకటేష్, వాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

బుక్కరాయసముద్రం: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ శాఖ జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ అధికారులకు సూచించారు. బుధవారం కొర్రపాడులోని అంబేడ్కర్ బాలికల ప్రభుత్వ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు, ఎంత మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి విద్యను అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిద్దరాచెర్ల సర్పంచ్ సాకే రామాంజినేయులు, వేదాంతం మోహన్, ప్రభుదాస్, అంజి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

గుత్తి: రాయలసీమ ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకించిన చంద్రబాబుకు ఇక్కడ పర్యటించే అర్హత లేదన్నారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదై ప్రాంతాల్లో రాయలసీమ రెండో స్థానంలో ఉందన్నారు. దీన్ని గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రాయలసీమలో అనేక ప్రాజెక్టులు నిర్మించారన్నారు. అయితే చంద్రబాబు రాయలసీమను ఏదో ఉద్ధరించినట్లు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అసలు రాయలసీమ ప్రాంతంలో పర్యటించే అర్హత, హక్కు చంద్రబాబుకు లేదన్నారు. ప్రభుత్వం హంద్రీ–నీవా నుంచి త్వరలోనే గుత్తి చెరువుకు నీళ్లు ఇస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాయలసీమ ప్రాంతంలోని అన్ని చెరువులకు నీళ్లిచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ గాదిలింగేశ్వర బాబు అలియాస్ జగన్, కో–కన్వీనర్ దేవా, జ్ఞానేశ్వర్‌రెడ్డి, గ్రానైట్ శివ, మల్లికార్జున, దామోదర్, యాగంటి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

వైభవంగా రాజగోపుర కలశ ప్రతిష్ట

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని రామలింగేశ్వర స్వామి ఆలయ రాజగోపుర కలశ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. నూతన రాజగోపురాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఆయన కలశస్థాపన, హోమాలు, తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ రాజగోపురాన్ని అద్భుతంగా నిర్మింపజేసిన ఆలయ కమిటీ ఛైర్మన్ ఎం.వెంకటరెడ్డి, సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. భక్తులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. ఎమ్మెల్యే వైవీఆర్, రిటైర్డ్ ఆర్‌టీఓ సోమిరెడ్డి, బళ్లారి భీమిరెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రామలింగప్ప, తదితర ప్రముఖులను ఆలయ కమిటీ ఛైర్మన్ వెంకటరెడ్డి పూలమాల, శాలువాతో సత్కరించగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయానికి జనరేటర్‌ను ఇవ్వాలని వెంకటరెడ్డి కోరగా తప్పనిసరిగా అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు నగేష్, కేశప్ప, కోశాధికారి వీరుపాక్షిరెడ్డి, సభ్యులు మస్తానయ్య, కమలేష్, సురేష్, మధు, అర్చకుడు ప్రసాద్, ఎం.తిమ్మారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కసాపురం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మల్లికార్జున రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జింకల రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


రాజగోపురాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

కోదండరామాలయ అభివృద్ధికి పాటుపడండి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలో అతిపురాతనమైన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆలయ పాలక మండలి సభ్యులకు సూచించారు. బుధవారం కోదండరామస్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్‌గా వై.శరణబసిరెడ్డి, ధర్మకర్తలుగా ఎం.మల్లికార్జున శాస్త్రి, కె.మురళీధర్, కె.లక్ష్మి, పి.హారిక, బీటీ.లక్ష్మిదేవి, ఎం.లక్ష్మికాంతమ్మ, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకుడు రాజేంద్రశర్మ ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈఓ మతం మల్లికార్జున, దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణి సభ్యుల చేత ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే వైవీఆర్ పాలక మండలి సభ్యులందరినీ శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారమందిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, జెడ్పీటీసీ కదిరప్ప, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, పామిడి ఎంపీపీ మురళీరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు సుంకప్ప, పార్టీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, కసాపురం ట్రస్ట్ బోర్డుసభ్యుడు త్యాగరాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గోశాలకు ఆవుల తరలింపు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి అశోక్‌నగర్ ప్రాంతంలో రోడ్లపై ఉన్న ఆవులను తరలించేందుకు యత్నించారు. ఈ క్రమంలో అశోక్‌నగర్‌కు చెందిన ఆవుల యజమాని విజయేంద్ర అడ్డుకునే ప్రయత్నం చేశాడు. నగర ప్రజలు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తుంటే అడ్డుకోవడం సరికాదని కార్యదర్శి సంగం శ్రీనివాసులు హితవు పలికారు.

రామాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


పూజల్లో పాల్గొన్న ఆలూరి రమణారెడ్డి, గ్రామస్తులు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కుటుంబం రూ.5 లక్షల విరాళం అందజేసింది. బుధవారం గ్రామంలో జరిగిన రామాలయ ముఖ ద్వారా ఏర్పాటు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆలూరి రమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రోటరీపురంలో రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షలు విరాళం అందించినట్లు తెలిపారు. సర్పంచ్ కామాక్షి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మి నారాయణ, నాగా, మల్లేష్, నాగరాజు, మల్లయ్య, సూర్య నారాయణరెడ్డి, రాము, లక్ష్మీనారాయణ, అప్పి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శింగనమల: మండలంలోని చీలేపల్లి, కొరివిపల్లి, జులాకాల్వ, పి.జలాలపురంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ యోగేశ్వరి తెలిపారు. ఉదయం 7 గంటలకు చీలేపల్లి, కొరివిపల్లి, మధ్యాహ్నం 2 గంటలకు జులాకాల్వ, పి.జలాలపురం గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


దుర్గంలో పర్యటిస్తున్న వైద్యాధికారులు

నార్పల: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బి.పప్పూరు పీహెచ్‌సీ వైద్యుడు మహేంద్రనాథ్ సూచించారు. బుధవారం ఆయన దుర్గం గ్రామంలో సర్పంచు రామాంజనేయులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా జ్వరాలపై సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ విజయమ్మ, వైద్యాధికారులు మల్లికార్జున, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'మా ఫొటోలతో ఫ్లెక్సీల ఏర్పాటు సిగ్గుచేటు'


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానంద రెడ్డి తమ ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి గాలి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు దేవరపల్లి నారప్ప, గుమ్మడి ప్రసాద్‌గౌడ్ అలియాస్ బ్లడ్ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జీవానందరెడ్డి వైఎస్సార్ సీపీలో ఉన్న సమయంలో ఆయనతో కలిసి ఫొటోలు దిగామన్నారు. జీవానందరెడ్డి టీడీపీలో చేరాక అతనితో తమకు ఎలాంటి సంబంధాలు లేవన్నారు. అలాంటప్పుడు తమ ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. తమ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను తొలగించాలని, లేని పక్షంలో తామే తొలగిస్తామని హెచ్చరించారు.

రామాలయ అభివృద్ధికి చర్యలు


రామాలయంలో సర్వే చేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

శింగనమల: స్థానిక పురాతన రామాలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం కర్నూలు డివిజన్ దేవదాయ శాఖ స్థపతి సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ఇంజినీర్ హరిత, ఈఓ బాబు అభివృద్ధి పనుల కోసం ఆలయాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరిక మేరకు వారం రోజుల క్రితం టీటీడీ అధికారులు దేవాలయాలని పరిశీలించి, వీటికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకుని వెళ్లిన విషయం తెలిసిందే. ఆలయంలో రాజగోపురం, విమాన గోపురం, బండపరుపు నిర్మాణం, ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం, తలంబ్రాల మండపం పనులు చేపట్టనున్నట్లు ఈఓ బాబు తెలిపారు. వీరి వెంట ఆలయ చైర్మన్ జీవీ సురేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ ఉన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న వెంకటలక్ష్మి

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గొల్లమానుపల్లిలో ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు వివరాల మేరకు.. గొల్లమానుపల్లికి చెందిన వెంకటలక్ష్మి, రంగారెడ్డి అక్కా తమ్ముడు. వీరి మధ్య కొంత కాలంగా ఆస్తి తగాదా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రంగారెడ్డి అక్క వెంకటలక్ష్మి ఇంటికెళ్లి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా అందరూ చూస్తుండగానే కింద పడేసి ఇష్టానుసారం కొట్టాడు. స్థానికులు సర్దిజెప్పినా వినలేదు. దీంతో మనస్తాపం చెందిన వెంకట లక్ష్మి పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రశాంత జీవనం సాగించాలి

యల్లనూరు: గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన తిమ్మంపల్లిలో ఎస్ఐ రామకృష్ణతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన రమాదేవి(38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కడుపు నొప్పి తాళలేక ఆమె ఈ నెల 1న ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. తీవ్రంగా కాలిన గాయాలైన ఈమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త గోపాలకృష్ణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: ఇగుడూరు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సెబ్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎర్రగుడి బాస్కర్, మేడికుర్తి విశ్వనాథ్, ఆదినారాయణ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం


విద్యార్థులకు నగదు అందిస్తున్న దృశ్యం

యాడికి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులకు తాడిపత్రి ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవాసంస్థ సభ్యులు బుధవారం ఆర్థికసాయం అందించారు. ఒకే కుటుంబానికి చెందిన జయవర్ధన్, స్వప్న వైద్యవిద్యకు, మరో విద్యార్థిని దీపిక క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు రూ.21,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీకర్‌రెడ్డి, శ్రీహరి, శంకర్, చెన్నకేశవులు, రంగయ్య తదితరులు పాల్గొ న్నారు.

దేవదాయశాఖకు రూ.2 లక్షల ఆదాయం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం నుంచి దేవదాయ శాఖకు రూ.2 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గూగూడు కుళ్లాయిస్వామికి ఉత్సవాల అనంతరం పోగైన చెక్కరను ఈ నెల 4న ఆలయ ప్రాంగణంలో వేలం వేయగా కేజీ రూ.34తో పలువురు కొనుగోలు చేశారన్నారు. మొత్తం 6,189 కేజీలకు గాను రూ.2,10,426 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.

15న సంచార జాతుల బహిరంగ సభ

గుత్తి: గుంతకల్లు ఈ నెల 15 న సంచార జాతుల బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, దాసరి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంకె రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని కాల్వ గడ్డ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సంచార జాతులకు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బహిరంగ సభకు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఇందిరా దేవి, దాసరి సంక్షేమ సంఘం నాయకులు సుంకయ్య, మహేష్, వెంకట స్వామి, కుళ్లాయప్ప, సంజీవ, రామాంజి, మారి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

పుట్లూరు: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ దిలీప్‌కుమార్ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన పుట్లూరు, కడవకల్లులో పర్యటించి చోరీల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఢిల్లీ నుంచి దొంగల గ్యాంగ్ జిల్లాకు వచ్చినట్లు సమాచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.